ప్రమాదకరంగా కల్వర్టులు

- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



శాంతినగర్ శివారులో ప్రమాదకరంగా ఉన్న లోలెవల్ కల్వర్టు

చిట్యాల: చిట్యాల నుంచి టేకుమట్లకు వెళ్లే ప్రధాన రోడ్డులో ఉన్న పలు లోలెవల్ కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రయాణికులు అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో వరద ఉధృతి పెరిగి కల్వర్టులు నిండి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలాగే కల్వర్టులు శిలావస్థలకు చేరుకోవడంతో పాటు అందులో గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రేగొండ నుంచి గర్మిళ్లపల్లి వరకు కాంట్రాక్టర్ డబుల్ రోడ్డును నిర్మించారు. కాని కొన్ని లోలేవల్ కల్వర్టులను నిర్మించి.. మరికొన్నిటిని అలాగే వదిలేశాడు. గతంలో కల్వర్టులలో వాహనాలు పడి కొంత మందికి గాయాలపాలైన సంఘటన ఉన్నాయి. సంబంధిత అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి లోలేవల్ కల్వర్టులను హైలేవల్ కల్వర్టులుగా నిర్మించాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

హైలెవల్ కల్వర్టులను నిర్మించాలి



టేకుమట్ల నుంచి చిట్యాలకు లోలెవల్ కల్వర్టుల నుంచి వెళ్లాలంటే ఇబ్బంది కరంగా ఉంది. వర్షాకాలంలో అయితే వెళ్లలేని దుస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైలెవల్ కల్వర్టులను నిర్మించాలి. **- చకిలం వెంకటేశ్వర్లు, డ్రైవర్, టేకుమట్ల**

క్రీడలతో మానసికోల్లాసం



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కాటారం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలో షటిల్ టోర్నమెంట్ పోటీలను ఆయన నిర్వహించారు. కాలనీ యువత ఉత్సాహంగా టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. యువత మద్యం, డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని క్రీడా పోటీల్లో పాల్గొంటే ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. విజేతలకు కాలనీకి చెందిన శశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శనగర్ కాలనీ అధ్యక్షుడు ఎడ్ల సతీశ్ పటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆత్మకూరి కుమార్‌యాదవ్, రమేశ్‌నాయక్, శశిధర్‌రెడ్డి, గడ్డం కొమురయ్య యాదవ్, పున్నం రమేశ్, ఓలపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



సీఐకి నగదు అందజేస్తున్న వ్యాపారులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక హోమ్ నీడ్స్ వ్యాపారులు పోలీసులకు విరాళం అందజేశారు. స్థానిక సీఐ నరేష్‌కుమార్‌కు రూ.50వేల నగదు అందజేశారు. పట్టణంలోని అన్ని వర్తక వాణిజ్య సంఘాలు, కాంట్రాక్టర్లు ముందుకు వచ్చిన ఆర్థిక సాయం అందజేయాలని సీఐ కోరారు.

బుగులోని జాతరకు ఆహ్వానం



కడియం కావ్యకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

రేగొండ: మండలంలో రెండో తిరుపతిగా ప్రసిద్ధి చెందిన బుగులోని జాతర సందర్భంగా ఈ నెల 14 నుంచి 18 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు రావాలని ఎంపీ కడియం కావ్యకు నిర్వహణ కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే జాతర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ఎస్పీ కిరణ్‌ఖరే, జిల్లా ఓఎస్డీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు, సింగరేణి పర్సనల్ మేనేజర్ మారుతి, ట్రాన్స్‌కో డీఈ పాపిరెడ్డి, వరంగల్ దేవాదాయ డిప్యూటీ జోనల్ కమిషనర్ శ్రీకాంతరావులకు జాతర చైర్మన్ వెంకటస్వామి, ఈఓ బిల్లా శ్రీనివాస్ ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజేందర్, రమణారెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, కడారి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

వెంకటాపురం(కె): మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడిన ముఠాను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక సీఐ బండారి కుమార్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. గురువారం స్థానిక పెట్రోల్‌బంక్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై నూగూరు వైపు నుంచి మండల కేంద్రానికి వస్తూ పోలీసులను చూసి బైక్‌ను వెనక్కా తిప్పుకొని పారిపోయేందుకు ప్రయత్నించారు. గమనించిన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న వారిని విచారించగా ఏటూరునాగారం మండలం రామన్నగూడేనికి చెందిన జూపాక ప్రశాంత్, ఖానాపురం మండలం కల్తీ రాజు, ఖమ్మం జిల్లాకు చెందిన గార ప్రవీణ్‌లుగా గుర్తించినట్లు తెలిపారు. వారి నుంచి బంగారు చెవికమ్మలు, ఇంటి తాళాలు పగల గొట్టేందుకు ఉపయోగించే ఐరన్‌రాడ్, మొబైల్‌ఫోన్, బంగారపు రింగులు, వెండి పట్టీలు హీరో హోండా స్పెండర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో భద్రత



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టేకుమట్ల: గ్రామ కూడలిలతో పాటు, ప్రతీ వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత సాధ్యమని ఏఎస్సై పింగిళి అమరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్సై గోగికారి ప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలోని ద్వారకపేటలో సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా వంద మందితో సమానమన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడైనా చోరీ, ప్రమాదం సంభవించినా కేసును సులభంగా ఛేదించే అవకాశం ఉంటుందన్నారు. గ్రామస్తులు సైతం ధైర్యంగా ఉండవచ్చని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మహేందర్, గ్రామస్తులు ఉన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఆరోపణలు



మాట్లాడుతున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుపై అసత్య ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ తరపున ఖండిస్తున్నామని పార్టీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజల రవీందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు అంబాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు విస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ..గతంలో బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నట్లుగా రూ.90 కోట్ల నిధులు మంజూరు చేయడంలో జాప్యం జరిగిందని, అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత నిచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సత్యనారాయణరావు చొరవతో భూపాలపల్లి పట్టణ అభివృద్ధి కోసం అనేక ప్రాజెక్టులకు నిధులను తెచ్చారన్నారు. గత ప్రభుత్వంలో తప్పుడు పనులు చేసినందునే మీ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గుర్తుంచుకోవాలని సూచించారు. తప్పుడు ప్రచారాలు ఆపకపోతే ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు శిరుప అనిల్, కురిమిళ్ల శ్రీనివాస్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, క్యాతరాజు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

వెంకటాపురం(ఎం): విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి పేర్కొన్నారు. వసతి గృహాల విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచడంతో శుక్రవారం మండల కేంద్రంలోని మైనారిటీ కళాశాలలో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిల్కూరి అయిలయ్య, చెన్నోజు సుర్యనారాయణ, బానోతు భాస్కర్, జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, జాకీర్, గోల్లెన వెంకటేష్, అన్నబోయిన రాజు, గడ్డమీది ప్రమోద్, రెడ్డి ఎల్లయ్య ఉన్నారు.

‘ఎయిడ్స్’పై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఐసీటీసీ కౌన్సిలర్ రమేశ్

కాళేశ్వరం: ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అలాగే బాధ్యత వహించాలని మహదేవపూర్ సమీకృత సలహా పరీక్ష కేంద్రం (ఐసీటీసీ) కౌన్సిలర్ గాదె రమేష్ అన్నారు. శుక్రవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం పీహెచ్‌సీలో వైద్యాధికారిని డాక్టర్ సుస్మిత అధ్యక్షతన ఆశ డే సందర్భంగా ఏఎన్‌ఎంలకు, ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చాపకింద నీరులా ఎయిడ్స్ వ్యాపిస్తుందన్న విషయాన్ని గ్రహించి, ఆ వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. రిస్క్ పాపులేషన్ సమూహాలైన ట్రక్ డ్రైవర్లు కాళేశ్వరం ప్రాంతానికి ఇతర పట్టణాల నుంచి ఇసుక క్వారీల వద్దకు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో హెచ్‌ఐవీ ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. ప్రతి గర్భిణీ రక్త పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. హెచ్‌ఐవి పాజిటివ్ వ్యక్తులను సమాజంలో అందరి మాదిరిగానే వారిని ఆదరించాలని కోరారు. హెచ్‌ఐవి పాజిటివ్ వ్యక్తుల కుటుంబ సభ్యులు రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు. హెచ్‌ఐవీ పాజిటివ్ వ్యక్తులు ఏఆర్‌టీ మందులను క్రమం తప్పకుండా వాడాలన్నారు. అనుమానాలు సందేహాల నివృత్తికి 1097 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంఎంఎల్ హెచ్‌పీ డాక్టర్ రమ్య, పీహెచ్ఎన్ సూపర్‌వైజర్ నీరజ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘సదర్’పై యాదవుల సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న నాయకులు

కాటారం : రాష్ట్ర ప్రభుత్వం యాదవుల అతి పెద్ద పండుగ అయిన సదర్‌ను రాష్ట్ర అధికార పండుగగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో యాదవులు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. ప్రధాన కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌తో కూడిన చిత్రపటానికి యాదవ సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. యాదవులు బాణసంచాపేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు సందనవేన మహేంద్రనాథ్ యాదవ్ మాట్లాడుతూ సదర్ పండుగను రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లోనే కాకుండా గ్రామగ్రామాన ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సదర్ పండుగకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య యాదవ్, బోయిని రాజన్న, కొడారి చిన్నమల్లు, లింగన్న, రాజ్‌కుమార్, ఐలయ్య, లచ్చన్న, నవీన్, రాజన్న, సతీశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ ఎప్పుడో?



రైతు వేదికలో నిరుపయోగంగా ఉన్న కుట్టుమిషన్లు

చిట్యాల: మహిళ సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా కుట్టమిషన్లు అందించాలని గతంలో అప్పటి జిల్లా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు నిధులు కేటాయించి కుట్టు మిషన్లు కొనుగోలు చేసి మండలాలకు సరఫరా చేశారు. ఈ మేరకు అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లు అందించాడానికి జాబితా సిద్ధం చేయాలని మండల అధికారులను ఆదేశించారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో కుట్టుమిషన్లను మండలంలోని రైతుల వేదికలలో భద్రపరిచారు. అవి అప్పటి నుంచి అక్కడే నిరుపయోగంగానే ఉండిపోయాయి. లబ్ధిదారులకు ఎప్పటి ఇస్తారోనని ఎదురు చూపులే మిగిలాయి. వెంటనే కుట్టుమిషన్లు పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని మహిళ సంఘాల సభ్యులు కోరుతున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



రేగొండ: రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: ఎమ్మెల్యే గండ్రకు కేక్ తినిపిస్తున్న ప్రకాశ్‌రెడ్డి

జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే భూపాలపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, రేగొండ మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రక్తదానం చేసిన కార్యకర్తలకు, ప్రజలకు ప్రసంశ పత్రాలు అందజేశారు. **- సాక్షి నెట్‌వర్క్**



చిట్యాల: జన్మదిన వేడుకల్లో నాయకులు



టేకుమట్ల: కేక్ కట్ చేస్తున్న నాయకులు



మొగుళ్లపల్లిలో..



భూపాలపల్లి రూరల్: కొత్తపల్లి(ఎస్ఎం)లో..

సమగ్ర సర్వేకు సహకరించాలి



గోవిందరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ జవహర్ రెడ్డి అన్నారు. కులగణన సర్వేలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ముందస్తుగా ఇంటింటికీ కుటుంబాల ఆధారాల కోసం స్టిక్కర్లు వేసిన ఎన్యుమరేటర్ల పనితీరును పరిశీలిస్తూ కుటుంబ యజమానులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. నేటి(శనివారం) నుంచి ప్రారంభమయ్యే కులగణన సర్వేలో ఇంటికి వచ్చే అధికారులకు ఇంటి యజమానులు సహకరించాలి అని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు వివరాలు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శి చుంచు భారతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నియామకం



మల్హర్: శ్రీ మిత్ర ఫౌండేషన్ మండల కన్వీనర్‌గా తాడిచర్ల గ్రామానికి చెందిన కేసారపు సురేందర్‌ని శుక్రవారం ఫౌండేషన్ చైర్మన్ అట్టెం రమేష్ ముదిరాజ్ నియమించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. పేదవారికి సాయం చేయడానికి ఒక అద్భుతమైన అవకాశం ఇచ్చిన శ్రీ మిత్ర ఫౌండేషన్ చైర్మన్ అట్టెం రమేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా భరత్



భూపాలపల్లి రూరల్: ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులుగా దోర్నాల భరత్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మందకుమార్‌కు, వేల్పుల సూరన్నకు, జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతికి, జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళికి భరత్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం: విద్యుత్ లైన్ మరమ్మతులో భాగంగా మహాముత్తారం మండలం బోర్లగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉప కేంద్రంలోని పలు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

టేకుమట్ల: 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(శనివారం), రేపు (ఆదివారం) ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాల్లో పేరు తొలగించాలన్నా, నమోదు చేయాలన్నా, ఇంటిపేరు మార్పు, భర్త పేరు, వయస్సు మార్పు చేసుకోవాలనుకునే వారు స్థానిక పోలీంగ్ కేంద్రంలో బీఎల్‌ఓలకు అందించాలని, వయస్సు మార్పు చేసుకోవాలనే వారు తప్పని సరిగా పదవ తరగతి మెమో చూపించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాటాపూర్‌లోని జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుధాకర్ శుక్రవారం తెలిపారు. జిల్లాలోని వెంకటపూర్ మండలంలోని పాలంపేటలో నిర్వహించిన వాలీబాల్ అండర్ 14 విభాగం సెలక్షన్ పోటీల్లో పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న గొప్ప వినయ్, జశ్వంత్ ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయను హెచ్‌ఎం సుధాకర్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సక్రు నాయక్, అక్బర్ పాషా, జీవన్ లాల్, వెంకటేష్, పాపారావు, రాజేష్, శ్రీదేవి, జైపాల్, సామ్సన్ , సమ్మయ్య, మోహన్ పాల్గొన్నారు.

ఆర్టీఓకు సన్మానం



ములుగు రూరల్: ఆర్టీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించి శ్రీనివాస్‌ను బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు శుక్రవారం ఆర్టీఓ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకటేష్, హరీష్, కృష్ణమూర్తి, విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ ద్వారా ఫారాల పంపిణీ

ఏటూరునాగారం: ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేపై పీఆర్ఆర్ యూనిటీ చారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నమూనా ఫారాలను ప్రజలకు అందజేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు మడుగూరి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటా పంపిణీ చేశారు. సర్వేలో ఇంటింటికి వచ్చి వివరాలు నమోదు చేసుకుని ఎన్యుమరేటర్లకు అవసరమైన వివరాలను సకాలంలో అందించే విషయంపై ప్రజలకు ఈ ఫారం ద్వారా అవగాహన కల్పించామన్నారు. మండల కేంద్రంతో పాటు చిన్నబోయినపల్లి, గోగుపల్లి, శివాపూర్, రామన్నగూడెం, రాంనగర్, రొయ్యూరు, శంకరాజుపల్లి గ్రామాల్లో పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, పాలకుర్తి శ్రీనివాస్, వెలకుర్తి శ్రీనివాస్, మడుగూరి శ్రీనివాస్, శంకర్, శివతో పాటు తదితరులు పాల్గొన్నారు.